

రోడ్డు ఆధునికీకరణ పనులు చేపట్టాలని వినతి


ఎంఎల్ఎ దాట్లతో దొమ్మేటివారిపాలెంవాసులు

ప్రజాశక్తి-ముమ్మిడివరంరూరల్

ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ఆధునికీకరణ పనులు చేపట్టాలని దొమ్మేటివారిపాలెం వాసులు ఎంఎల్ఎ సుబ్బరాజుకు విన్నవించారు. నగర పంచాయతీ పరిధిలోని 19వ వార్డు ప్రాంతమైన దొమ్మేటివారిపాలెం నుంచి కొందుకుదురు మీదుగా ముక్తేశ్వరం వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుకు ఆధునికీకరణ పనులు చేపట్టాలని మంగళవారం పలువురు ఎంఎల్ఎ సుబ్బ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంఎల్ఎ స్పందించి ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్‌ని ఆదేశించారు. కార్యక్రమంలో కడలి నాగు, డి.ఏడుకొండలు, డి.రామ్‌కుమార్,కొండబాబు,జి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలయ్యేనా?

- సమస్యల వలయంలో ఆశ వర్కర్లు
- ఫిబ్రవరిలో అధికారుల చర్చల్లో పలు హామీలు
- అమలు మరచిన గత ప్రభుత్వం
- నూతన సర్కారుపైనే ఆశలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఆశ వర్కర్స్‌కి కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి పెండింగులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అందిస్తున్న వైద్య, ఆరోగ్య సేవల్లో కీలక పాత్ర వహిస్తున్నా వారిని సర్కారు పట్టించుకోవడం లేదు. అరకొర వేతనాలకే పరిమితం చేసింది. ఆందోళనల నేపథ్యంలో వైసిపి ప్రభుత్వం హయాంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చలు జరిగాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను త్వరలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ అమలు కాలేదు. ఇటీవల అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరిస్తుందనే ఆశతో వారు ఎదురు చూస్తున్నారు.

కనీస వేతనాల్లేవ్

కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 3,200 మంది ఆశ కార్యకర్తలు పనిచేస్తున్నారు. నిరంతరం ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పనిచేస్తున్న ఆశాలకు కనీస వేతనం కరువైంది. రోజురోజుకీ పెరుగుతున్న నిత్యావసరాల ధరలను దష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అనేకేళ్లుగా కోరుతున్నారు. పప్పులు, బియ్యం, కూరగాయలు, పెట్రోలు, డీజిల్,గ్యాస్ ధరలు విద్యుత్, రవాణా ఛార్జీలు, చెత్త పన్ను అంటూ ఇలా గత ప్రభుత్వం పేదలపై అనేక భారాలను మోపింది. ఇటీవల నిత్యావసరాలు సరుకుల ధరలు పైపైకి ఎగబాగుతున్నాయి. దీంతో ప్రస్తుతం ఇచ్చే అరకొర వేతనం నెలలో పది రోజులకు కూడా సరిపోని పరిస్థితి ఏర్పడిందని ఆశాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే దుస్థితికి చేరారు. అప్పులు పుట్టక అనేకమంది పస్తులతో గడుపుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలా అనేకమంది ఆశాలు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. కాని పాలకులు వీరి సమస్యలను పట్టించుకున్న దాఖాలు లేవు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, విధి నిర్వహణకు నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని కోరుతున్నారు ఆశ యాప్‌తో బాటు వేరే ఇతర ఆన్ లైన్ వర్కుల వల్ల ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. వాటిని నిరోధించాలని కోరుతున్నారు. లెప్రసీ, టిబికి సంబంధించిన సర్వేలు చేయిస్తున్నప్పటికీ వాటికి పారితోషకాలు ఇవ్వడం లేదు. గత సంవత్సరం చేయించిన సర్వేలకు ఇవ్వవలసిన పారితోషకాలు ఇంత వరకు ఇవ్వలేదు.కాబట్టి వాటిని వెంటనే చెల్లించాలి డిమాండ్ చేస్తున్నారు.

ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి

ప్రస్తుతం అన్ని నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మాకు ఇచ్చే వేతనం ఏ మూలకూ చాలడం లేదు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. పలు సర్వేలకు టిఎ, డిఎ బకాయిలు ఇవ్వాల్సి ఉంది. వాటిని వెంటనే విడుదల చేయాలి. రాజకీయ వేధింపులు ఆపాలి. నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలి.

- కె.శాంతమణి, ఆశావర్కర్, రాజమహేంద్రవరం

పెండింగ్‌లో ఉన్న అంశాలు

యూనియన్ నాయకులతో జరిగిన చర్చలు సందర్భంగా పలు అంశాలు పెండింగులో ఉన్నాయి. అలాగే అంగీకరించిన అంశాలకు సంబంధించి జిఒలను విడుదల చేయాల్సి ఉంది. కనీస వేతనాలు చెల్లింపు విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని కమిషనర్ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. ఏ కారణంతో మరణించినా రూ.10లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. పిఎం జెజెబివై పథకం అమలు విషయాలను ప్రభుత్వంతో చర్చించి తగు నిర్ణయం చేస్తామని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించి రూ.60 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. దీనికి యూనియన్ ప్రతినిధులు అంగీకరించలేదు. హర్యానాలో ఆశావర్కర్స్‌కు అమలవుతున్న విధంగా రూ.2 లక్షల ఇవ్వాలని కోరారు. ఈ విషయమై ప్రభుత్వంతో చర్చించి తగు నిర్ణయం తెలియజేస్తామని కమిషనర్ తెలిపారు. కమ్యూనిటీహెల్త్ వర్కర్లను ఆశావర్కర్‌గా మార్పునకు సంబంధించిన సమస్య ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ దష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి సహకరిస్తామన్నారు. ఎఎన్ఎం, జిఎన్ఎమ్ ట్రైనింగ్ పొందిన ఆశావర్కర్లకు ఖాళీల భర్తీలో వెయిటేజీకి అంగీకరించారు. అంగీకరించిన అంశాలకు సంబంధించి మినిట్స్ కాపీ, సర్క్యులర్స్, జిఒలను జారీ చేయాల్సి ఉంది. పెండింగ్లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్, సహజ మరణానికి ఎక్స్‌గ్రేషియో, సమస్యల పరిష్కారానికి మరో దఫా చర్చలు జరిపి పరిష్కరించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రజాశక్తి-అమలాపురం

రామచంద్రపురం విఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 20న నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్విని యోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పిలుపునిచ్చారు మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ వారి ఛాంబర్ నందు వివిధ కంపెనీ లకు సంబంధించి పోస్టులు వివరాలను తెలుపుతూ కరపత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సుమారు 30 కంపెనీలు హెచ్ఆర్ ప్రతినిధులు ఈ యొక్క జాబ్ మేళాకు హాజరైన వారిలో తమ తమ సంస్థలకు అనువైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. నిరుద్యోగ యువత ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కాళ్లపై తాము నిలబడి జీవించాలని ఆయన సూచించారు. నిరుద్యోగ యువత మధ్య దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఎటువంటి రుసుములు ఈ జాబ్ మేళాలో చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా వెబ్సైట్లో తమ పేర్లు నమోదు చేసుకుని విద్యార్హత ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరై అర్హతలకు తగ్గట్టుగా మంచి ఉద్యోగ అవకా శాలను చేజిక్కించు కోవాలన్నారు. వికాస పథక సంచాలకులు కె.లచ్చా రావు మాట్లాడుతూ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నారని అన్నారు. నిరుద్యోగ యువత అందరూ ఉదయం 9 గంటలకే తమతమ పేర్లు ఆన్లైను మరియు ఆఫ్లైన్లో నమోదు చేసుకుని అవకాశం ఉన్నదని, సుమారు 1859 ఖాళీలను భర్తీ చేసేందుకు వీలుగా ఈ మెగా జాబ్ మేళా ను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో.కోనసీమ జిల్లా మేనేజర్ జి.రమేష్, కాకినాడ జిల్లా వికాస మేనేజర్ కె.శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్ఎకు వినతి


ఎంఎల్ఎ ఆనందరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

తమ సమస్యలను పరిష్కరించాలని అమలాపురం నియోజకవర్గ గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ తరపున మంగళవారం అమలాపురం పార్టీ కార్యాలయంలో ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావుని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎదురుకొంటున్న ప్రధాన సమస్యలు, వారి యొక్క ప్రమోషన్ ఛానెల్ గురించి అలాగే ఆంధ్రప్రదేశ్ లో ఉన్న అన్ని ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖల్లోనలైజ్ చేయాలని వినతి పత్రంలో కోరారు. దీనిపై ఎంఎల్ఎ ఆనందరావు సానుకులంగా స్పందించి ఇంజినీరిగ్ అసిస్టెంట్ల సమస్యలను ముందుగా కలెక్టర్ కి తెలియపరచి అనంతరం సిఎం దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

డెంగీ బాధితులకు పరామర్శ

అమలాపురం రూరల్: డెంగీ జ్వరాలతో బాధపడుతున్న రోగులను డిఎంహెచ్ఒ దుర్గారావు దొర, ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు. మంగళవారం అమలాపురం మండలం రెడ్డిపల్లి గ్రామంలో వారు పర్యటించి డెంగీ జ్వరాలపై ఆరా తీశారు. అనంతరం డెంగీ బాధితులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో శానిటేషన్, బ్లీచింగ్, డెంగీ ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆనందరావు తెలియ జేశారు. డెంగీ పరీక్షలు కూడా నిర్వహించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్, వైద్యాధి కారి స్వర్ణకమల, మాజీ సర్పంచ్ కరాటం సూర్య భాస్కర్ రావు, నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎన్‌హెచ్‌ల నిర్మాణం, విస్తరణతో సమగ్రాభివృద్ధి

ప్రజాశక్తి-అమలాపురం

జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ ద్వారా సమగ్రాభివృద్ధికి అవకాశాలు మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రాంతాల మధ్య ఆర్థిక ప్రగతి బహుముఖంగా విస్తరిం చడానికి జాతీయ రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశపు హాలు నందు జాతీయ రహదారులకు సంబం ధించిన ఇంజినీర్లు, రెవెన్యూ సిబ్బందితో జిల్లాలో నిర్వహిస్తున్న రహదారుల పనుల పురోగతి, మరియు పెండింగ్ అంశాలపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జిల్లా అభివృద్ధిలో జాతీయ రహదారులు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి నెల అవగాహన సమావేశాలు రోడ్లు భద్రతపై రెగ్యులర్‌గా నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా మానవ జీవితాలకు రక్షణ కల్పించాలన్నారు. జిల్లా లో ఉన్న వివిధ జాతీయ రహదారుల విస్తరణకై ప్రతిపాదించిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు జిల్లాలో మూడు ప్రాజెక్టులు ఉన్నాయని ఒకటి 216 ఏ జాతీయ రహదారి పావర్లపూడి- దిండి రోడ్డు విస్తరణ, రెండవది ఈతకోట వద్ద టోల్ ప్లాజా విస్తరణకు భూ సేకరణ, మూడవది నరసాపురం- దిండి బైపాస్ రోడ్డుకు 14 కిలోమీటర్ల మేర భూసేకరణ అంశాలు ఉన్నాయన్నారు. జాతీయ రహదారులు రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వపు శాఖ ఆధ్వర్యంలో 216ఎ రోడ్డు విస్తరణ యానాం నుండి దిండి వరకు మొదటి ప్యాకేజ్ విస్తరణ పనులు 2022 నవంబర్‌లో పూర్త య్యాయన్నారు. రెండో ప్యాకేజీ దిండి నుంచి ఆరంభమైందని పసలపూడి వద్ద భూసేకరణకు సంబంధించి భూస్వాముల నుండి కొన్ని ఇబ్బందులు ఉత్పన్న మయ్యే అని వీటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని జెసికి సూచించారు. గతంలో ఈ రోడ్డు కేవలం ఏడు మీటర్లు వెడల్పుతో ఉండేదని ప్రస్తుతం దీన్ని పది మీటర్ల క్యారేజీ రోడ్డుగా డివైడర్ తో సహా రెండువైపులా కాలువలతో విస్తరించి నిర్మిస్తారన్నారు. రోడ్డు నిర్మాణంలో మేజర్ జంక్షన్లో వద్ద రోడ్డు భద్రత పరంగా జాగ్రత్త చర్యలను చేపట్టాలని జాతీయ రహదారుల విభాగాల ఇంజనీర్ల సూచిం చారు. రోడ్ల విస్తరణ అనంతరం సంబంధి త కాంట్రాక్టర్ రోడ్డు నిర్వహణతో పాటుగా రోడ్డుకు రెండు వైపులా ప్లాంటేషన్ డెవలప్ చేయించాలన్నారు. జాతీయ రహదారులపై ఎక్కువగా ప్రమాదాలు సంభవించుచున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి ప్రమాదాల నివారణ కొరకు మరింతగా భద్రత చర్యలను పటిష్టం చేయాలన్నారు. జొన్నాడ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నవంబర్ నాటికి పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్కు సూచించారు. రావులపాలెం జంక్షన్ లో ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని, రావులపాలెం డిగ్రీ కళాశాల వద్ద ప్రతిపా దించిన సర్వీస్ రోడ్డును తాను పరిశీలన చేస్తానని తెలిపారు. ఈతకోట టోల్ ప్లాజా వద్ద శాశ్వత భవనాలు మౌలిక వసతులు కల్పనకు భూసేకరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో జెసి ఎస్ నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జాతీయ రహదారులు రవాణా రహదారుల మంత్రిత్వపు శాఖ పీడీ సాయి శ్రీనివాసులు, జాతీయ రహదారుల అధికార సంస్థ కార్యనిర్వాహక ఇంజినీర్ (విశాఖ) ఇ.శ్రీని వాసులు, జాతీయ రహదారుల అధికార సంస్థ పథక సంచా లకులు (రాజ మహేంద్రవరం) డి.సురేంద్రనాథ్, ఆర్‌డిఒలు తహశీల్దార్లు పాల్గొన్నారు.

కలెక్టర్ ను కలసిన ఎపిఎన్‌జిఒ అసోసియేషన్

కపిలేశ్వరపురం/కొత్తపేట: జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఆర్.మహేష్ కుమార్ ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలచి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు గుద్దటి రామమోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, రాష్ట్ర పారా మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరపు వెంకటేశ్వర్లు, అమలాపురం, కొత్తపేట, రాజోలు, మండపేట, రామచంద్రపురం, యూనియన్ అధ్యక్షులు సిహెచ్.రాజశేఖర్, మోటూరి రామారావు, డి.సుబ్రహ్మణ్యం, జె.మల్లికార్జునుడు, చిక్కాల సూర్యారావు, ప్రధాన కార్యదర్శులు పి. కోదండరామయ్య, వెంకట రామారావు, ఐ.ప్రతాపరాజు, టి.ఇమ్మానియేలు తదితరులు కలెక్టర్‌ను కలిసి ఉద్యోగుల పలు సమస్యలపై చర్చించారు.

తాగునీటి నాణ్యత పరిశీలన


తాగునీటి నిల్వలు పరిశీలిస్తున్న జలజీవన్ మిషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-అంబాజీపేట

మాచవరం, తొం డవరం గ్రామాల సర్పంచులు నాగాబత్తుల శాంతాకుమారి, పేరాబత్తుల రామ లింగరాజు(దొరబాబు)ల ఆధ్వర్యంలో ఓవర్‌హెడ్ ట్యాంకులు నీటి నిల్వలు చేసే షంప్‌ల వద్ద తాగునీటి నమూనాలను జలజీవన్ మిషన్ ప్రతినిధులు భరత్, టి.గోవింద్ మరియు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ బి.చలమయ్య మంగళవారం పరిశీలించారు. పలు ప్రాంతాల్లో కుళాయిలు, ఎయిర్ వాల్వ్‌లు వద్ద పైప్ లైన్ల పరిస్థితిని పర్యవేక్షించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్దేశించిన సమయాల్లో ట్యాంక్‌లు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచిం చారు. కార్యక్రమంలో నాగాబత్తుల సుబ్బారావు, కార్యదర్శులు జిజివికె.కుమార్, డి.లక్ష్మీపతి, పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది జెవిఎస్ఆర్. ప్రసాద్, ఎస్.షరోన్, జ్యోతి, సుభాషిణి, బి.సర్వేశ్వరరావు, పృథ్వీ, సంతోష్,హేమ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని మరిచిన సిఎం చంద్రబాబు

మాజీ ఎంఎల్ఎ జగ్గిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిర్ల జగ్గిరెడ్డి

ప్రజాశక్తి-కొత్తపేట

సిఎం చంద్రబాబు నిత్యం గత వైసిపి ప్రభుత్వంపై శ్వేతపత్రాల పేరుతో ప్రచారాలు చేయడం తప్ప ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని మరిచారని మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు మంగళవారం రావులపాలెం వైసిపి కార్యాలయం నందు నిర్వహించిన మీడియా సమావేశంలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ సంపద సృష్టిస్తాం అని గొప్పలు చెప్పిన సిఎం చంద్రబాబు ఇప్పుడు ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉందని మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన ఎంఒయులు వీళ్ళ హయాంలో జరిగిపోతున్నట్టు ప్రచారాలు చేసుకోవడం, ఉచిత ఇసుక పేరుతో టిడిపి నాయకుల దోపిడీ దందాలు మితిమీరి పోతున్నాయని అన్నారు. తల్లికి వందనం పేరుతో ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని మరలా వారే ప్రతీ తల్లికి అని మాట మారుస్తున్నారని అన్నారు. రైతులకు రబీ సీసన్ ధాన్యం డబ్బులు నియోజకవర్గంలో రూ.45 కోట్ల పైనే బకాయిలు ఉన్నాయన్నారు. 3 నెలలు గడిచినా వారికి డబ్బు వేయలేదని ఎన్నికల పేరుతో ఆపిన చెల్లింపులు ఈ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు పైనే అయినా ఇంకా వెయ్యకపోవడం బాధాకరం అని అన్నారు. ఉచిత ఇసుక అంటూ సామాన్యులకు అందుబాటులో ఇసుక ఉంచుతాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పేది ఒకవైతే కొత్తపేట నియోజకవర్గంలో స్థానిక టిడిపి నాయ కులు తీరు దోపిడీకి పరాకాష్టగా ఉందని అన్నారు. ఈ పద్ధతి మార్చుకోకపోతే స్థానికులకు న్యాయం జరిగేలా మేమే స్టాక్ రీచ్‌లకు వెళ్లి జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం ముందు వచ్చిన వాహనాలకు ముందు ఇసుక ఇచ్చి పంపించే విధంగా చర్యలు తీసుకుంటామని జగ్గిరెడ్డి హెచ్చరించారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-కొత్తపేట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తోందని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి చేసి సంపద సృష్టించి సంక్షేమాన్ని ప్రజలకు అందించడానికి సిఎం చంద్రబాబు పని చేస్తున్నారని అన్నారు. గత వైసిపి పాలనలో అవినీతి, అరాచకాలను ప్రజల ముందుకు శ్వేతపత్రం రూపంలో కూటమి ప్రభుత్వం విడుదల చేయడాన్ని వైసిపి నేతలు తట్టుకోలేకపోతున్నారని బాబ్జి విమర్శించారు.

20న 'కపిలేశ్వరపురం' మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 20 న నిర్వహిం చనున్నట్లు ఎంపిడిఒ కొండలరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో శనివారం ఉదయం 10:30 గంటలకు ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమావేశానికి జెడ్‌పిటిసి సభ్యులు, గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, డివిజనల్, మండల స్థాయి అధికారులుపూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

పంట కాలువల ఆధునికీకరణకు రూ.10 లక్షల మంజూరు

ప్రజాశక్తి -మామిడికుదురురూరల్

తాటిపాక ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో రెండు పంట కాలవల ఆధునికీకరణకు రూ.10 లక్షలు మంజూరయ్యాయని ఇరిగేషన్ ఎఇ సందరసింగ్ మంగళవారం తెలిపారు 14 కిలోమీటర్ల పొడవున్న మానేపల్లి ఛానెలకు రూ.5లక్షలు, మూడు కిలోమీటర్ల పరిధి ఉన్న కడలి ఛానల్ ఆధునికీకరణకు రూ.5లక్షలు మంజూరయ్యాయన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం


పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కపిలేశ్వరపురం దేవి సెంటర్ ప్రాథమిక మెయిన్ పాఠశాల్లో స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఇఒ కె.తాతారావు, పాఠశాల హెచ్ఎం అంబటి శ్రీనివాస్, అగస్త్యేశ్వరరావు ,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

100 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ర్యాలి మ్యాజిక్ హౌస్ వద్ద అనూస్ స్వచ్ఛంద సంస్థ మరియు రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కొత్తపేట నేత్రాలయ ప్రాథమిక కంటి ఆసుపత్రి వైద్యులు కె వీరబాబు మరియు వారి బృందం ఆధ్వర్యంలో సుమారు 100 మందికి నేత్ర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనూస్ స్వచ్ఛంద సంస్థఅధ్యక్షుడు డాక్టర్ మోహిత్, సభ్యులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఎయు దూర విద్య డైరెక్టర్‌కు ప్రజాహిత పురస్కారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఆంధ్రా యూనివర్సిటీ దూరవిద్య విభాగం డైరెక్టర్ గా నూతనంగా భాద్యతలు స్వీకరించిన ఎన్.విజయ్ మోహన్‌కి ప్రతిష్టాత్మక మోడరన్ ఫౌండేషన్ ప్రజహిత పురస్కారాన్ని అందజేశారు. మంగళవారం మోడరన్ విద్యాసంస్థల అధినేత లయిన్ జివి.రావు విశాఖలో దీనిని అంద చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జివి.రావు మాట్లాడుతూ డైరెక్టర్ విజయమోహన్ నేతతంలో ఎయుదూర విద్యా విభాగం విశేషమైన సేవలు అందించాలని ఆకాంక్ష వ్యక్తం చేసారు.విజయ మోహన్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థుల ప్రతిభకు ఆలంబనగా నిలు స్తున్న మోడరన్ విద్యాసంస్థల నుంచి పురస్కారం పొందడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మోడరన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కో -ఆర్డినేటర్ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


విజయ్‌మోహన్‌కు ప్రజాహిత పురస్కారం అందజేస్తున్న జివి.రావు

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం రూరల్

ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం కోరింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో పోలమ్మ చెరువు గట్టు వద్ద బి శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో సర్వేయర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యల పై చర్చించారు.అనంతరం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది.ఈ ఎన్నికల్లో సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎం సురేష్(కాకినాడ) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా గోరింకల శ్యామ్ కుమార్(రామచంద్రాపురం), ఉపాధ్యక్షుడిగా వెంకటేష్(రాజమహేంద్రవరం), సెక్రటరీగా పాటి రాంబాబు(పిఠాపురం), ట్రెజరర్‌గా వినోద్‌కుమార్ (రాజమహేంద్రవరం), జాయింట్ సెక్రటరీ గా వివేక్(రామచంద్రాపురం) లతో పాటు అడ్వైజరి కమిటీ సభ్యులుగా ఎల్ఎంవి ప్రసాద్, అప్పన్న బాబు, బి.సతీష్, పి.సత్తిబాబు, సంతోష్ బెంజిమెన్, శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

చికిత్సకు రూ.20వేల సాయం

ప్రజాశక్తి-ముమ్మిడివరంరూరల్

అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాధితురాలికి మెరుగైన వైద్య ఖర్చులు నిమిత్తం ముమ్మిడివరం ఎస్‌సి సంక్షేమ సంఘం మంగళవారం ఆర్థిక సాయం అందించింది. తోట్ల పాలెం గ్రామానికి చెందిన ఆకుమర్తి నాగేంద్రప్రసాద్, శాంతికుమారి దంపతుల రెండో కుమార్తె జ్యోతి అరుదైన వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైంది. పేద కుటుంబానికి చెందిన బాధితురాలికి మెరుగైన వైద్య చికిత్స కొరకు షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మట్టా శ్రీనివాస రావు మరియు సభ్యులు సమకూర్చిన రూ.20 వేలను బాధిత కుటుంబానికి మంగళ వారం అందజేశారు. కార్యక్రమంలో జనిపల్లి సత్యనారాయణ, కాశి వెంకటాచార్య కటికీదల రాము, నక్కా శ్రీనివాస్, బుడితి వెంకటేశ్వర్లు, పాము ఆనందరావు, కాశి బాబాయ్, బి.బాబురావు, ఎం.లక్ష్మణ్‌కుమార్, జగపతి భైరవ తదితరులు పాల్గొన్నారు.


బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్‌సి సంక్షేమ సంఘం

నేరాలు ఘోరాలు

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన అడ్డాల రాజబాబుపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓ గిరిజన యువతి తనను నమ్మించి గర్భవతిని చేసి మోసం చేశాడంటూ రాజబాబుపై ఫిర్యాదు చేసింది. దీనిపై మంగళవారం పెద్దాపురం డిఎస్‌పి లతాకుమారి గ్రామంలో విచారించారు. అనంతరం బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇందుకు కారకుడైన అడ్డాల రాజబాబుపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని ఎర్రవరం జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికి అక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పెద్దాపురం మండలం గుడివాడకు చెందిన కనపర్తి సూర్యుడు(80) ఫైనాన్సు నిమిత్తం తన మోటార్ సైకిల్‌పై ఏలేశ్వరం మండలం పేరవరం వచ్చి తిరిగి వెళుతుండగా జాతీయ రహదారిపై విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మతునికి భార్య ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు తరలించినట్లు ఎఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండల పరిధిలోని జెడ్ రాగంపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వివరాల మేరకు...సోమవారం సాయంత్రం రంపచోడవరం గ్రామానికి చెందిన కేతమల్ల సూర్యచంద్ర మోటార్ సైకిల్‌పై రాజానగరం నుంచి జగ్గంపేట వైపు వెళ్తుండగా జెడ్ రాగంపేట గ్రామ సమీపంలో వేగంగా వచ్చిన ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూర్యచంద్ర తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

కాంక్రీట్ మిక్సర్ బెల్ట్‌లో పడి కార్మికుని మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలానికి చెందిన అచ్చంపేట గ్రామంలో కాంక్రీట్ మిక్సర్ రోలింగ్ యూనిట్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందాడు. బెల్ట్ ఆధారంగా తిరుగుతున్న మోటారులో కార్మికుడు చిక్కుకోవడంతో అతని శరీర అవయవాలు తునాతునకలయ్యాయి. మృతుడు పిఠాపురం మండలం లక్ష్మీ నరసాపురం గ్రామానికి చెందిన బుర్రా సత్యసాయిగా గుర్తించారు. విషయం తెలిసి సంఘటనా స్థలానికి సామర్లకోట పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. అయితే ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

తప్పిపోయిన యువతి అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

ఇంటినుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన తెలంగాణా రాష్ట్రానికి చెందిన మెదక్ జిల్లా మూసాయిక్‌పేట మండలం పోతనపూడి గ్రామానికి చెందిన రాజోలు రాజేశ్వరి (20)ని సామర్లకోట రైల్వే పోలీసులు ఆమె తల్లిదండ్రులకు మంగళవారం అప్పగించారు. స్థానిక రైల్వే ఎస్ఐ బి.లోవరాజు అందించిన వివరాల ప్రకారం..పోతనపూడి గ్రామానికి చెందిన రాజోలు బాలరాజు కుమార్తె రాజేశ్వరి ఫిబ్రవరి నెలలో ఇంటినుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడ కేసు నమోదైంది. అయితే అయిదు నెలలు గడుస్తుండగా సామర్లకోట రైల్వే స్టేషన్లో ఎస్ఐ, సిబ్బంది స్టేషన్ సాధారణ తనిఖీలో భాగంగా అనుమానితులైన ప్రయాణీకులను విచారి స్తుండగా తప్పిపోయిన రాజేశ్వరి పోలికలతో కనిపించిన యువతిని పోలీసులు ఆరా తీశారు. అనంతరం ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించగా వారు మంగళవారం స్థానిక స్టేషన్‌కు చేరుకోగా వారి నిర్ధారణతో రాజేశ్వరిని తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు.

మద్యం విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఆలమూరు ఎస్ఇబి పోలీసులు మంగళవారం అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. ఎస్ఇబి ఎస్ఐ కె.సత్యవేణి తెలిపిన వివరాలు ప్రకారం.. మండపేట పట్టణంలోని గొల్లపుంతకు చెందిన దొంతంశెట్టి శివలింగేశ్వరరావు మద్యం విక్రయిస్తున్నాడని ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో నిందితుడు 180 ఎంఎల్ సామర్థ్యంతో 19 మద్యం బాటిళ్లను కలిగి ఉండి అధిక ధరలకు విక్రయిస్తున్నాడన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని సీజ్ చేసి, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సత్యవేణి తెలిపారు. అలాగే ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట మండలాలలో ఎవరైనా ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్లయితే సెల్ నెంబర్ 9959841282కు సమాచారం అందజేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

బోదెలో పడి పశువుల కాపరి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రమాదవశాత్తు లోతైన బోదెలో పడి పశువుల కాపరి మృతి చెందాడు. ఈ ఘటన గుడ్డిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుడ్డిగూడెం గ్రామానికి చెందిన మాడుగుల అశోక్ అదే గ్రామానికి చెందిన కామిశెట్టి మురళీకృష్ణ అనే రైతుకు చెందిన పశువులను మేపుతుంటాడు. సోమవారం ఎప్పటిలానే పశువులను తోలుకొని వెళ్లాడు. సాయంత్రం 6 గంటలైనా పశువులను అశోక్ తీసుకు రాకపోవడంతో రైతు గాలింపు చేపట్టాడు. పశువులు గ్రామ శివారులో చింతలపూడి కాలువ వద్ద ఉన్నట్లు గుర్తించారు. అశోక్ కనిపించలేదు. దీంతో గోపాలపురం పోలీస్ స్టేషన్లో అదే రోజు రాత్రి ఫిర్యాదు చేశారు. మంగళవారం తెల్లవారుజామున ఒక జామాయిల్ తోట వద్ద నీటి బోదే వద్ద కర్ర, చెప్పులను గుర్తించారు. బోదెలో గాలింపు చేపట్టగా అశోక్(26) మృతదేహం లభ్యమైంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించినట్లు తెలిపారు.

నూతన చట్టాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం



ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

నూతన క్రిమినల్ చట్టాలపై మహిళలు, బాలికలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రవీణ అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలోని స్త్రీ శక్తి భవనంలో సిడిపిఓ జి.ఉష అధ్యక్షతన నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ నాగరిక సురక్ష సంహిత, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య అధినయంగా మార్పు చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఉమాదేవి, చంద్రకళ, వెంకటలక్ష్మి, ప్రమీల, తెలుసామంగ, బేబీ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


నూతన కమిటీ నాయకత్వంలో అతిథులు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 327 రాజమహేంద్రవరం సర్కిల్‌లో నూతనంగా ఏర్పడిన రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ కమిటి ఎన్నికైంది. కంపెనీ గౌరవ అధ్యక్షులు కాశీ మోహన్‌రావు, స్టేట్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, కంపెనీ కార్యదర్శి పిఎస్ఎస్.వెంకటేశ్వర రావు, స్టేట్ జనరల్ సెక్రటరీ, జిల్లా కార్యదర్శి అంబటి రాజారత్నం, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట చిన వెంకట్రావు, టౌన్ డివిజన్ ప్రెసిడెంట్ ముప్పిడి గణేష్, సెక్రటరీ కొప్పిశెట్టి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్లు చల్లారామ్, అరె రాంబాబు, బుల్లాబ్బాయ్, గంట్లని రమేష్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. డివిజన్ గౌరవ అధ్యక్షులుగా తుమ్మల తాతరావు, డివిజన్ ప్రెసిడెంట్‌గా ఎంసిహెచ్.అప్పలరాజు, సెక్రటరీగా పిల్లి వైవి.ప్రసాద్, ట్రెజరర్‌గా కుసుమ శివ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.మాధవరావు, పబ్లిసిటీ సెక్రటరీగా ఐ.దుర్గాప్రసాద్, అడిషనల్ సెక్రటరీగా పి.నాగబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీగా బి.రత్నరాజు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్‌వివి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బాలలు, మహిళల చట్టాలపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నిభావని

ప్రజాశక్తి - తాళ్లరేవు

పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు జరిగిన 2013 ఆ చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధించబడతాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిభావని తెలిపారు. మంగళవారం మాధవరాయని పేట అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, బాలల హక్కుల చట్టాల పై అవగాహన సదస్సు జరిగింది. బాల్య వివాహాలు జరిగిన, ప్రోత్సహించిన వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని, హిందూ, ముస్లిం, క్రైస్తవ సంప్రదాయం ప్రకారం ఏ విధంగా జరిగిన బాల్య వివాహాలు ఎవరు జరిపిన, వారందరి పైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పవన్ అభిమాని సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి


సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న జనసేన నాయకులు

అమీనాబాద్ గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్ వీరాభిమాని దాడిచర్ల లక్ష్మణరావు విజయవాడ కనకదుర్గ గుడికి. సైకిల్‌పై మంగళవారం ఉదయం బయలుదేరాడు. యానంకు చెందిన లక్ష్మణరావు గత కొంతకాలం నుంచి అమీనాబాద్ గ్రామంలో ఉన్న బంధువులు ఇంటి వద్ద నివాసం ఉంటున్నాడు. గడిచిన సాధారణ ఎన్నికల రావడం, పిఠాపురం నుంచి పవన్ కళ్యాణ్ ఎంఎల్‌ఎగా విజయం సాధిస్తే విజయవాడ కనకదుర్గ ఆలయానికి వస్తానని లక్ష్మణరావు మొక్కుకున్నాడు. ఆ మొక్కును తీర్చుకునేందుకు మంగళవారం సైకిల్‌పై విజయవాడ బయలుదేరే క్రమంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు సానా లోవరాజు, గవర రాంబాబు లక్ష్మణరావుకు పూలదండ వేసి, ఫ్రూట్స్, ఇతర ఆహార సామాగ్రిని అందజేసి సైకిల్ యాత్రని ప్రారంభించారు. సైకిల్‌పై ప్రారంభమైన యాత్ర కొత్తపల్లి నుంచి పిఠాపురం, సామర్లకోట, ద్వారపూడి, అనపర్తి,. రాజమహేంద్రవరం మీదుగా మీదుగా విజయవాడ చేరుకుంటానని లక్ష్మణరావు తెలిపాడు.

యానాం వార్తలు


మునిస్వామికి వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

జంగిల్ క్లియరెన్స్ అయ్యాకే బిల్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక దరియాలతిప్ప ఫ్రెంచ్ కెనాల్‌కు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్, కెనాల్‌లో పూడికతీత పనులు పూర్తియ్యాకే సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వాలని దరియాలతిప్ప రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ఎఒ మునిస్వామిని వారు కలిపి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువలో పూడికను పూర్తిస్థాయిలో తీయలేదని, దీనివల్ల కాలువలో చివరి పొలాల వరకు నీరు పారడం లేదన్నారు. జంగిల్ క్లియరెన్స్‌ను ప్రొక్లైనర్‌తో చేసి కోట్ల రూపాయలతో నిర్మించిన ర్యాంపును పాడు చేశారని వివరించారు. అసంపూర్తిగా పనులు చేశారని, కావున పూర్తి స్థాయిలో పనులు చేపట్టాకే బిల్లులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రెసిడెంట్ తిరుకోటి భైరవమూర్తి, వైస్ ప్రెసిడెంట్ వాకపల్లి సుబ్బారావు, సెక్రటరీ మట్టా రాంబాబు, జాయింట్ సెక్రటరీ సబ్బతి రాంబాబు, ట్రెజరర్ సబ్బతి లోకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆలయానికి మైకుసెట్టును అందిస్తున్న దాతలు

సాయిబాబా గుడికి మైకుసెట్టు బహూకరణ

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాల పేటలో ఉన్న సాయిబాబా గుడికి దాతల సహకారంతో మైకు సెట్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు దాసరి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మైకు సెట్ ఏర్పాటు చేసిన సాలిగ్రామ విశ్వనాథ శర్మ, కడలి వాసు, నాయుడు శ్రీమాధవ పరిమళ, సుధా ప్రసాద్, కొమ్మిరెడ్డి పరశురాం, సిహెచ్ భరతుడులకు ఆలయ కమిటీ, సాయిబాబా యూత్ కృతజ్ఞతలు తెలిపారు.


విద్యార్థులకు పుస్తకాలు అందచేస్తున్న గ్రామ పెద్దలు

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

స్వచ్ఛ సేవా సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ జరిగింది. మంగళవారం స్థానిక మెట్టకూరు, ఆదిఆంధ్రపేటలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను గ్రామ పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంఎల్‌ఎకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్పవరంలో మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం సర్పవరం భావన్నారాయణపురంలో ఓ మహిళ దారుణ హత్యకు గురియైన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం గుంజామ్ జిల్లాకు చెందిన భార్యభర్తలు జీవనోపాధి కోసం 3 నెలల క్రితం సర్పవరం భావన్నారాయణపురానికి వలసవచ్చారు. వీరికి మూడేళ్ళ బాబు ఉన్నాడు. భర్త నిల్లు స్వైన్ మూడురోజులుగా కూలి పని మానేసి మద్యం సేవించి భార్య కైరా పుటితో గొడవ పడుతున్నాడు. సమీప బంధువులు నచ్చచెప్పారు. మంగళవారం బంధువులు ఫోన్ చేసిన కైరా పుటి స్పందించక పోవడంతో అనుమానం వచ్చి వాళ్ళు నివాసముంటున్న ఇంటికి వచ్చారు. అప్పటికే కైరా పుటి(31) మృతి చెందినట్లు గుర్తించి వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. భార్య, భర్తల మధ్య ఘర్షణలలో భర్త నిల్లు స్వైన్ ఆమెను నెట్టివేయడంతో తలకు గాయమై ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం భర్త నిల్లు స్వైన్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి

ప్రజాశక్తి-అయినవిల్లి

కేంద్రంలోనూ,రాష్ట్రంలోనూ ఏర్పడిన కూటమి ప్రభుత్వాలు ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని అయినవిల్లి జెడ్‌పిటిసి. మాజీ సభ్యురాలు గంగుమళ్ళ కాశీ అన్నపూర్ణ, శ్రీనివాస్ అన్నారు. స్థానిక కె.జగన్నాథపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోడీ, ఎపి సిఎం నారా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ల చిత్రపటాలను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి విత్తనాల వెంకటరమణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-మామిడికుదురురూరల్

వర్షకాలం నే పథ్యం లో అంటు వ్యాధుల ప్రబలే ప్రమాదము పొంచి ఉందని ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీర్చుకోవాలని నగరం పిహెచ్‌సి వైద్యాధికారి స్వర్ణలత అవగాహన కల్పించారు మంగళవారం బి.దొడ్డవరం లో వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ యజ్ఞేశ్వరరావు, ఎఎన్ఎం ఉమా భవాని, ఎంఎల్‌హెచ్‌పి స్వరూప తదితరులు సేవలు అందించారు.

5 ప్రత్యేక కౌంటర్లలో టమోటా విక్రయాలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

బహిరంగ మార్కెట్‌లో టమోటా ధరలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా రైతుబజార్లలో అమ్మే ధరలకే నగరంలోని ఐదు బహిరంగ ప్రదేశాల్లో టమాటా విక్రయాలు నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ సహాయ సంచాలకులు ఎం.సునీల్ వినయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నామన్నారు. రాజమహేంద్రవరంలో మల్లయ్యపేట, ఎవి.అప్పారావు రోడ్డు, ప్రకాష్ నగర్, స్టేడియం రోడ్డు, బొమ్మూరు ప్రాంతాల్లోని ప్రధాన సెంటర్లలో ఔట్ లెట్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ధరల స్థిరీకరణకు ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బి కాలనీలో రైతు బజార్ ద్వారా టమోటా విక్రయాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బహిరంగ మార్కెట్లలో నిత్యావసర సరుకులు కూరగాయలు అధిక ధరలు ఉన్నందున సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ వారి ఆధ్వర్యంలో రైతు బజార్ల ద్వారా టమాటా కిలో రూ.55కే విక్రయిస్తున్నామన్నారు. అదేవిధంగా నేడు బహిరంగ మార్కెట్లో ఉన్న రేటు కంటే రు.20 తగ్గించి కందిపప్పును, రూ.10 తగ్గించి బియ్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సునీల్ వినయ్ రైతు బజార్ ఎస్టేట్ అధికారి శ్రీనివాస్‌బాజీ స్థానిక నాయకులు కొయ్యల రమణ, కాశీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల్లో నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షల్లో నిబంధనలు తప్పనిసరి అని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు చేసే విధంగా నిఘా వ్యవస్థను పెంచాలన్నారు. తనిఖీలో ఎవరైనా లింగం నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ఆధారాలు లభ్యమైతే సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన కేసులు నమోదు చేయడంతో పాటు స్కానింగ్ సెంటర్ లైసెన్స్‌ను రద్దు చేయాలన్నారు. అపరాధ రుసుం వేయాలన్నారు. పూర్తిస్థాయిలో స్కానింగ్ యూనిట్‌ను పరిశీలించిన తరువాతనే అనుమతి ఇవ్వాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు.

జిల్లాలో లింగ నిష్పత్తి సంఖ్య 800 కంటే తక్కువగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది జరిగిన ప్రసవాలు, లింగ నిష్పత్తి నివేదికను అందించాలన్నారు. ఈ ఏడాది సరోగసి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మెడికల్ బోర్డు నుంచి అనుమతి పొందిన మాత్రమే పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎన్‌పి.పద్మశ్రీ, డిఐఒ డాక్టర్ ఎన్.రాజకుమారి, దిశ డిఎస్‌పి ఆదినారాయణ, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎం.శ్రీహరిబాబు, ఐసిడిఎస్ పీడీ కె.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనధికార డంపింగ్ యార్డ్‌ను తొలగించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

అనధికార డంపింగ్ యార్డును తొలగించాలని జై భీమ్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్, కెవిపిఎస్ నాయకులు మీకోసంలో ఫిర్యాదు చేశారు. నిడదవోలు చుట్టుపక్క ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను, చెత్తను తీసుకొచ్చి జననివాసాలు ఉంటున్న ప్రాంతంలో డంపు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నార. ఈ డంప్ చేస్తున్న ప్రాంతం చెంతనే మార్కెట్, ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయం, మున్సిపల్ కాంప్లెక్స్ ఉన్నాయన్నారు. పేదలు నివాసం ఉండే ఈ ప్రాంతంలో చెత్తను డంప్ చేయడం తగదన్నారు. వెంటనేద దీన్ని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో తూరుగోపు నాగేంద్ర పాల్గొన్నారు.

హాస్టల్స్ నిర్వహణపై దిశానిర్దేశం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

హాస్టల్స్ నిర్వహణపై సంక్షేమ శాఖల అధికారులకు కలెక్టర్ పి.ప్రశాంతి దిశానిర్దేశం చేశారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని అన్ని సాంఘిక, గిరిజన, బిసి సంక్షేమ వసతిగృహాల నిర్వహణ, మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలి అని స్పష్టం చేశారు. విద్యా విధానంలో మెరుగైన ఫలితాలను సాధించడంలో ఆయా వసతిగృహాల నిర్వహణ కూడా ఒక ప్రధాన అంశం అన్నారు. వివిధ పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో వసతిగృహాలపై ప్రతికూల కథనాలు వస్తున్నాయని, సరైన నిర్వహణ వ్యవస్థ దిశగా అడుగులు వేయాల్సి ఉందన్నారు. వసతి గహాలలో తక్షణం చేపట్టాల్సిన మరమ్మతులుకు సిఎస్ఆర్ నిధులను కేటాయించి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అందుకు అనుగుణంగా ప్రతిపాదన సిద్ధం చేసి నివేదిక అందజేయాలన్నారు. ఈ సమావేశం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.సందీప్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎస్.జ్యోతి, కొవ్వూరు బిసి సంక్షేమ అధికారి కె.రామకృష్ణ పాల్గొన్నారు.